# శాంతి సమరం

సరిగ్గా సర్కస్ మొదలయిన వారం రోజులకు ముసురు పట్టింది. ఆ ముసురు ముసురు నాలుగు రోజులు వదలలేదు. దాంతో ఆ నాలుగు రోజులూ సర్కస్ వేయలేదు. అంతేగాక మరో రెండు రోజులు దెబ్బతిన్న ప్రదేశాలు రిపేరు చేయడానికి, నేల తడి ఆరడానికి సరిపోయింది.

మళ్ళీ ఆ రోజు రాత్రి ఏడు గంటలకు సర్కస్ మొదలవుతుంది. అందుకే సర్కస్ మేనేజర్ శాంతాదేవి సాయంత్రం నాలుగ్గంటల నుంచి హైరానా పడిపోతూ వుంది. చుట్టూ డేరాను పర్యవేక్షించింది. చినిగిపోయిన చోట్ల కుట్లు వేయించింది మగవాళ్ళ రెండు బుకింగుల దగ్గర క్యూలను, ఆడవాళ్ళ రెండు బుకింగుల దగ్గర క్యూలను తిరిగి కట్టించింది.

జంతువులకు సరిగ్గా ఆహారం అందిందో లేదో పర్యవేక్షించింది. సర్కస్ ఆర్గనైజర్‌ని పిలిచి ఈ రోజు రెండు షోలకు ప్రదర్శించవలసిన ప్రత్యేక ఐటమ్స్ గురించి చర్చించింది. వెంటనే రెండు రిక్షాలను, ఒక ఆటోను అద్దెకు తీసుకుని రిక్షాలను టౌన్‌లో ప్రచారం కోసం పంపింది. ఆటోను చుట్టుప్రక్కల పల్లెలకు పంపింది ఆరు గంటల నుంచే సర్కస్ గుడారం సెర్చి లైటును ఆకాశంలోకి ఫోకస్ చేసి అన్ని వైపులకూ తిప్పింది.

శాంతాదేవికి చాలా ఆనందంగా వుంది. గత ఆరు రోజులుగా సర్కస్ వేయనందున ఆదాయం లేదు. ఖర్చు మాత్రం ఎక్కువగా వుంది. ఈ రోజు మళ్ళీ సర్కస్ మొదలు పెడుతున్నారు. కాబట్టి కలె

క్షన్ బాగా వుంటుంది. ఈ ఆరురోజుల ఖర్చు ఒక్క రోజులో రాబట్టాలి అనే నమ్మకంతో వుందామె

స్కూలు మైదానంలో వేయబడిన ఆ సర్కస్ గుడారానికి అమర్చబడిన మైకులోంచి పాటలు చెవులు గింగుర్లు పెడుతున్నాయి. పిల్లలు సర్కస్ గుడారం బయట మూగి కేరింతలు కొడుతున్నారు. పెద్దవాళ్ళు సర్కస్ బయట కట్టివేయబడి వున్న ఏనుగులను, గుర్రాలను, ఒంటెలను మాలిష్ చేస్తున్నారు. లోపల ఆడవాళ్ళు, మగవాళ్ళు మేకప్ చేసుకుంటున్నారు.

సరిగ్గా ఏడు గంటలకు సర్కస్ మొదలవుతుంది. ముందు గుర్రం మీద జెండా పట్టుకొని ఒక చేతిలో శూలం పట్టుకొని, నెత్తిన కిరీటంతో భారతమాత వేషంలో ఒక స్త్రీ గ్రౌండులో పరిగెడుతుంటే సర్కస్‌లో పనిచేసే ఆడా మగా అంతా వెనుకనే పరుగెత్తి మరలా లోనికి వెళ్ళిపోయారు.

సర్కస్‌లో ఒక్కో ఐటమ్ జరుగుతోంది. స్లీవ్‌లెస్ జాకెట్టుతో, తొడలకు అతుక్కున్న జానెడె పోడవున్న డ్రాయరుతో అందమయిన పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తీగమీద నడుస్తోంది. కొంతమంది తీగె మీద బాలెన్సు మీద నడిచే ఆమె చాతుర్యానికి సంతోషిస్తే, మరి కొంతమంది యువకులు ఆమె తెల్లని నునుపైన తొడల్ని, ఎత్తయిన గుండెల్ని నోరు తెరుచుకుని చూస్తున్నారు.

పహిల్వాన్ గుండెల మీద పట్టా వేసుకుని వెల్లకిలా పడుకుంటే అతని గుండెల మీద ఏనుగు కాలు పెట్టడం, కోతి సైకిలు తొక్కడం, ఇనుప బార్‌లు పట్టుకుని ఊగుతూ ఆడా మగా ఫీట్స్ చేయడం అందమైన ముద్దుగుమ్మలు ఇంకా అందంగా అలంకరించుకొని చిరు నవ్వులు విసురుతూ చేతులు చేతులు పట్టుకొని సైకిళ్ళు త్రొక్కడం, ఒంటె మీద

స్వారి, గుర్రం మీద స్వారి, బఫూన్ చేష్టలు ప్రేక్షకుల చప్పట్లు, ఈలలు మధ్య హుషారుగా జరుగుతూ వుంది.

తనకు ఏర్పాటు చేసిన టెంటులో టేబుల్ కెదురుగా కుర్చీలో కూర్చుని వున్న శాంతాదేవి దగ్గరకు ఆ రోజు కౌంటర్లోని వ్యక్తులు వచ్చి మిగిలిన టిక్కెట్లు, క్యాష్ బాక్సులు టేబులు మీద పెట్టారు. మొత్తం నాలుగు కౌంటర్లలోనూ వచ్చిన డబ్బు లెక్క చూసిన శాంతదేవి నిరాశగా నాలుక చప్పరించింది.

కారణం ఆ రోజు వచ్చింది ఏవరేజ్ కలెక్షన్. ఆమె ఊహలు తారుమారయ్యాయి. మామూలు కలెక్షన్‌కు డబుల్ కలెక్షన్ వస్తుందను కొన్న ఆమె ఆశ నిరాశే అయింది. ఇన్ని రోజుల తర్వాత వేసిన ఆటకే ఇంత తక్కువ కలెక్షనువస్తే ఇక రాబోయే రోజుల్లో ఏమి వస్తుంది అనేది ఆమె బాధ. అయితే కౌంటర్లోని వ్యక్తులు సెకెండ్ షోకు మంచి కలెక్షన్‌లు తప్పక వస్తాయని ఆమెను ఓదార్చారు.

తర్వాత కొంతసేపటికి సెకండ్ షో ప్రారంభమైంది. సెకండ్ షోకు ఫస్ట్ షో కలెక్షన్‌కంటె తక్కువ వచ్చింది. ఆమె నిరాశతో కృంగి పోయింది. అందరూ వెళ్ళిపోయిన తర్వాత తన టెంటులో కుర్చీలో జార గిలబడి తల పట్టుకొని కూర్చుంది.

ఆమెకు గతం కళ్ళముందు మెదలాడుతోంది. తమది సర్కస్ కుటుంబం. తన తాత ముత్తాతలు తల్లిదండ్రులు సర్కస్‌లోనే జీవించారు. దానిమీదనే ఆధారపడి బ్రతికారు. తనను ఎనిమిదవ ఏటనే తిరుచూరు సర్కస్ కేంద్రంలో ట్రైనింగుకు పంపారు. సర్కస్ ట్రైనింగుకు పిల్లలు ఇంకా చిన్న వయసులోనే చేరతారు. ఆ వయసునుంచి ప్రాక్టీసు చేస్తే తప్ప శరీరం ఎటు వంగమంటే అటు వంగదు,

తనకు సరిగ్గా పద్నాలుగేళ్ళు వచ్చేసరికి అన్ని ఫీట్స్‌లోనూ ఆరి తేరింది. తరువాత సర్కస్ కంపెనీలో చేరి ప్రదర్శనలివ్వసాగింది.

దాదాపు ఆరేళ్ళు గడిచేసరికి తన ప్రాధాన్యత సర్కస్ కంపెనీ గుర్తించింది. తను చేసే ముఖ్యమైన ఫీట్స్ తీగమీద నడవడం, చేతుల్లో పొడవైన వెదురు బొంగు పట్టుకుని సన్నని తీగమీద ఆ చివరనుండి ఈ చివరి వరకు వేగంగా సైకిలు త్రొక్కడం.

తన అద్భుతమైన సౌందర్యం సర్కస్‌లో పనిచేసే యువకులకు కోటి కోర్కెలను రేపితే చూసే ప్రేక్షకులను పరవశింపజేసేది. ధనవంతు లయిన ప్రేక్షకులు కొందరు డబ్బు ఆశ చూపారు. కాని తను లొంగ లేదు. సర్కస్ కంపెనీలోని యువకులయితే సరేసరి. దొంగతనంగా తన సౌందర్యాన్ని నోరూరించుకుంటూ చూసేవారు తప్ప ధైర్యం చేసి అడగలేకపోయారు.

ఆ రోజుల్లోనే తను అదే సర్కస్ కంపెనీలో వెయిట్ లిఫ్టర్‌గా పనిచేస్తున్న డేవిడ్‌ని ప్రేమించింది. డేవిడ్ కూడా తనను గాఢంగా ప్రేమించాడు. దాంతో ఇద్దరూ పెళ్ళి చేసుకుని ఆనందంగా కాపురం చేయ సాగారు. ఒకరోజు సర్కస్ మేనేజర్ కొడుకు తనను మోహించి చేయి పట్టుకున్నాడు. అది తెలిసిన డేవిడ్ సర్కస్ మేనేజర్ కొడుకుని కొట్టి సర్కస్‌తో తెగతెంపులు చేసుకున్నాడు.

తరువాత తనూ, డేవిడ్ మిగుల్చుకొన్న సొమ్ముతో అప్పుడే ఒక మేనేజర్ అమ్ముతున్న చిన్న సర్కస్ కంపెనీని కొన్నారు. దాన్ని ఇద్దరూ శ్రమించి పదేళ్ళలో పెద్ద సర్కస్ కంపెనీగా వృద్ధి చేశారు. కానీ దురదృష్టవశాత్తూ గత సంవత్సరం డేవిడ్ ఒక ప్రమాదంలో మర ణించాడు. అప్పట్నుంచి తనే ఒంటరిగా సర్కస్ కంపెనీ నడుపుతోంది.

ఆనాడు జనం సర్కస్ ఎగబడి చూసేవారు. ఆదాయం విపరీతంగా వుండేది. కాల ప్రవాహంలో ప్రజల మనస్తత్వాలు మారాయి. చివరకు పల్లెజనం కూడా ఫాషను ముదిరిపోయి సినిమాలనే ఎగబడి చూస్తున్నారుగాని సర్కస్‌లవైపు దృష్టి మరల్చడంలేదు. ఇంతకుముందు రోజుల్లో అయితే ఎండాకాలం వచ్చే విపరీతమైన లాభాలను దాచుకొని వర్షాకాలంలో స్టాపుకు జీతాలిచ్చి పోషించేది. కాని ఇప్పుడు పరిస్థితి రెండు కాలాల్లోనూ ఒకే విధంగా వుంది.

సర్కస్ వేసినా వెయ్యకపోయినా నెల జీతాలిచ్చి స్టాపును పోషించాలి. నోరులేని జంతువులను కూడా పస్తు పెట్టకూడదు కదా. రెండు ఏనుగులకు రోజుకు ఆహారానికి ఎంత ఖర్చవుతుంది? పులులకు సింహాలకు ఆహారానికి అవసరమైన మాంసం ఖర్చు మాటేమిటి? ఒంటెలకు, గుర్రాలకు తగినంత మేత? మొత్తం ఖర్చు రోజుకు కొన్ని వందలు వుంటుంది. ఆదాయం వచ్చినా రాకపోయినా ఈ ఖర్చు తగ్గదుకదా.

తమ సర్కస్ జీవితం భద్రతలేనిది. ఎంత సాహసించి చేసినా చివరికి కనపడేది నష్టం. ఆమె ఈ జీవన సమరం ఇక సాగించలేననుకుంది. ఆలోచించే కొద్దీ ఆమె మనసు ఇంకా గందరగోళంగా తయారు కాసాగింది.

టైము చూసుకొంది శాంతాదేవి. రెండున్నరయింది. ఇంకోమూడు గంటల్లో తెల్లవారబోతోంది. ఆమె తన టెంటులోంచి బయటికి వచ్చింది. బయట విశాలమైన సర్కస్ గుడారం పైకప్పు క్రింద వున్న లైటు ఆ ప్రదేశాన్నంతా కాంతితో నింపి వుంది. సర్కస్ గుడారానికి తూర్పువైపు ముఖ ద్వారం. పడమరవైపు గుడారం అంచునే సర్కస్ ఉద్యోగులు

వుండడానికి టెంట్లు వున్నాయి. వాటి ముఖద్వారం సర్కస్ ఆవారం లోపలివైపుకు వున్నాయి.

వాటిలో మొదటి టెంటులో మేనేజరు శాంతాదేవి వుంటుంది. దాని ప్రక్కనే పెద్ద టెంటు వుంది. అందులో అవివాహితులయిన ఆడ పిల్లలంతా వుంటారు. శాంతాదేవి, తన టెంటు ప్రక్కనే వున్న పెద్ద టెంటు వైపు చూసింది. దాని దగ్గరకు నడిచి ముఖ ద్వారపు పట్టాను తొలగించి చూసింది. రాత్రంతా శ్రమించిన ఆడపిల్లలు అడ్డదిడ్డంగా పడి నిద్రపోతున్నారు. అందరూ పదహారూ, ఇరవై రెండేళ్ళ మధ్య వయసున్నవారే.

వాళ్ళను ఆ స్థితిలో చూసిన శాంతాదేవికి చాలా జాలి కలిగింది.

శాంతాదేవి ఆ రాత్రంతా నిద్రపోలేదు. సర్కస్ ఆడిటోరియంలో తిరుగుతూనే ఆ రాత్రంతా గడిపింది.

తెల్లవారేసరికి ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది. ఆ నిశ్చయం ప్రకారం నష్టాల ఊబిలో కూరుకుపోతున్న సర్కస్‌కు ఉద్వాసన చెప్పడం. ఒకప్పుడు తన భర్త పేరిట బ్యాంకులో వేసిన లక్షరూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్టుతో తను ప్రశాంతంగా జీవించడం.

ఉదయం పది గంటల సమయంలో అందర్నీ సమావేశపరచి తన నిర్ణయాన్ని తెలిపింది. స్టాఫులో ఎవరయినా సర్కస్ కొనేవాళ్ళుంటే తక్కువ ధరకు ఇచ్చేస్తానని, అలా కాకపోతే సర్కస్ సామగ్రిని జంతువులను విడివిడిగా అమ్మి ఆ డబ్బును సర్కస్ ఉద్యోగులకు పంచుతానని చెప్పింది. తనకు వయసు మీరిందని సర్కస్ నడిపే ఓపిక లేదని చెప్పింది.

ఈ ఆకస్మిక నిర్ణయం ఎందుకు చేసిందో అర్థంగాక మౌనంగా వుండిపోయారు.

అందరి హృదయాలు బెంబేలు పడిపోయాయి. వాళ్ళు ఆ షాక్ లోంచి తట్టుకునే లోపలే తన టెంటులోకి వెళ్ళి పడుకుంది. మధ్యాహ్నం ఎంతమంది ప్రతిమాలినా భోజనం కూడా చేయలేదు.

సరిగ్గా సాయంత్రం నాలుగు గంటల సమయంలో "అమ్మా" అంటూ పిలిచాడు సర్కస్ కంపెనీ ఆర్గనైజరు జేమ్స్.

"లోపలికి రా జేమ్స్" అంటూ పిలిచింది. అతని గొంతు గుర్తు పట్టిన శాంతాదేవి.

అతను లోపలికి వచ్చాడు. పడుకున్నదల్లా లేచి కూర్చుని "కూర్చో జేమ్స్" అంటూ దూరంగా వున్న కుర్చీ చూపించింది.

జేమ్స్ నెమ్మదిగా కూర్చున్నాడు.

"ఏం సర్కస్ కొనదలుచుకొన్నావా జేమ్స్" అంటూ అడిగింది.

"అమ్మా తమరు హాస్యమాడుతున్నారు. నాకంత దబ్బెక్కడిది?"

"నువ్వు ఒకడివి కాకపోతే మీరు నలుగురు కలసి పార్టనర్స్‌గా ఏర్పడి కొనవచ్చుగా" అంది అభిమానంగా.

"అమ్మా అంతమాట అనకండి. ఈ సర్కస్ కంపెనీలో పని చేసే అందరి తరఫునా మాట్లాడడానికి నేనిక్కడికి వచ్చాను. నేను చెప్పేది విని తరువాత తమరు ఏం చెప్తే అది వినడానికి సిద్దంగా వున్నాము"

శాంతాదేవి మౌనంగా వినసాగింది.

"ఈ సర్కస్‌ను మీరెంతో కృషిచేసి చిన్నగా వున్నదాన్ని ఇంత పెద్దది చేశారు. అది ఇక్కడ పనిచేసే అందరికీ తెలుసు.

ప్రస్తుతం మీరు నష్టాల్లో వున్నారని మాకు తెలుసు. అయినా

ఇప్పటివరకు మీరు "జీతాలు సక్రమంగానే పే చేస్తున్నారు. ఇన్నేళ్ళు దీన్ని ఎంతో జాగ్రత్తగా నడుపుకొంటూ వస్తున్నారు. ఇప్పుడు మేము దీన్ని కొన్నా సక్రమంగా నడపలేమని మాకు తెలుసు. అందుకనే మేమంతా ఒక నిర్ణయానికి వచ్చాం" ఆగాడు జేమ్స్.

శాంతాదేవి ఆశ్చర్యంగా చూసింది.

"ఈ సర్కస్ కళ ఇంతటితో అంతరించకూడదు. ఎన్ని కష్టాలు వచ్చినా దీన్ని మన భావి పౌరులకోసం దాచాలి. ఈ రోజు కాకపోయినా రేపయినా దీనికి విలువ వస్తుంది. అందుకే మాకు ఇక జీతాలు వద్దు. ఖర్చులుపోను వచ్చిన ఆదాయాన్ని అందరం సమంగా పంచుకుందాం. ఇక కష్టాలు సుఖాలు అందరికీ సమానమే. ఇదీ మా నిర్ణయం. ఏమంటారు?" అన్నాడు జేమ్స్.

సర్కస్ కళ మీద వాళ్ళకున్న అభిమానానికి ఆమె కళ్ళలోంచి కన్నీళ్ళు జల-జల రాలాయి. ఇక ఎన్ని కష్టాలు వచ్చినా తాను శాంతంగా సమరం సాగించాల్సిందే తప్ప వెనుకడుగు వేయకూడదను కొంది శాంతాదేవి.

*